నిఖార్సైన విద్యార్థి ఉద్యమ నాయకుడు వంగపల్లి



వంగపల్లి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 18: నిఖార్సైన విద్యార్థి ఉద్యమ నాయకుడు వంగపల్లి శ్రీనివాస్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం హరీశ్‌రావును కలిశారు. వంగపల్లికి హరీశ్‌రావుతో పాటు పెద్దిసుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో వంగపల్లి క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మలిదశ మాదిగ దండోరా ఉద్యమంతో అహర్నిశలు జాతి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారన్నారు. జాతి హక్కుల ఉద్యమ నాయకుడిగా వంగపల్లి చేసే పోరాటానికి వెన్నంటే ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేశ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాతాకుల భాస్కర్, కోర్ కమిటీ సభ్యుడు బంగారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమెరికాలో ఎమ్మెల్యే పల్లా పర్యటన

అరిజోనా స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ, అనురాగ్‌పల్లా

చేర్యాల, జూన్ 18 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అమెరికాలో పర్యటిస్తున్నారు. అమెరికా దేశం ఫినిక్స్ నగరంలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులతో హైదరాబాద్ నగర శివారు ఘటికేసర్ ప్రాంతంలోని అనురాగ్ యూనివర్సిటీ ప్రతినిధులు, ఉన్నత విద్యా, పరిశోధన రంగాలతో పరస్పరం సహకారం ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు సీఈవో ఎస్.నీలిమ, డైరెక్టర్(స్ట్రాటజీ) అనురాగ్ పల్లా పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం

సతీసమేతంగా బోనంతో ఆలయానికి వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- అమ్మవారి సన్నిధిలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

హుస్నాబాద్, జూన్ 18: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం జాతరను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనంతో వచ్చి అమ్మవారికి సమర్పించి పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఆలయ కమిటీతో పాటు అధికారులు, స్థానిక పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి సతీమణి సహా కుటుంబ సభ్యులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి చీరసారెలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కిషన్‌రావు, అర్చకుడు పరమేశ్వరశర్మ, ఆలయ సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తూము ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ కులస్తులు

సిద్దిపేట కమాన్, జూన్ 18: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు లింగారెడ్డిపల్లిలోని తుమ్మలకుంట చెరువు తూమును కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ముదిరాజ్ కులస్తులు కోరారు. ఈ విషయమై మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పాటు నీటి పారుదలశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న తుమ్మలకుంట చెరువు తూమును కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు బోనాల ఉప్పలయ్య. ఉపాధ్యక్షుడు తాటికొండ రమేశ్, కమిటీ సభ్యులు కీసరి వేణు, తాటికొండ శేఖర్, కదుర్ల రాజు, తాటికొండ లక్ష్మయ్య, కదుర్ల రవి, తాటికొండ శ్రీనివాస్, తాటికొండ లక్ష్మణ్, యాదగిరి, నర్సింహులు, రమేశ్, అమరేందర్, సంజీవులు, కీసరి నారాయణ పాల్గొన్నారు.

నాచగిరి క్షేత్రంలో స్వాతి నక్షత్ర పూజలు

వర్గల్, జూన్ 18: రాష్ట్రంలోనే రెండో యాదాద్రిగా పేరుగాంచిన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారి మేలుకొల్పుతో సహా విశేషపంచామృతాభిషేకం, మంగళహారతులు, వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. యాగశాలలో నృసింహస్వామి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. ఈవో అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, పాండు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చేర్యాల, జూన్ 18: మండంలోని ఆకునూరులో మంగళవారం స్పెషల్ ఆఫీసర్ శివాజీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పలువురు గ్రామసభ దృష్టికి తీసుకురావడంతో వాటిని అధికారులు, సిబ్బంది నోటు చేసుకున్నారు. అనంతరం ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాతావరణ పరిస్థితులు మారుతున్న క్రమంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీధర్‌గౌడ్, సుధారాణీ శ్రీశైలం, గ్రామ కార్యదర్శి బాలయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్పెషల్ అధికారి

నీట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

చేర్యాలలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

చేర్యాల, జూన్ 18: నీట్ విద్యార్థులను కేంద్రం రోడ్డుపై పడేసిందని, నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి రీ-ఎగ్జామ్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు.నీట్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ వైఫల్యంపై దేశ ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో నీట్ పరీక్షా ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించిందన్నారు. జూన్ 14 ఫలితాలు వెల్లడిస్తామని ప్రకటించి ముందుగానే ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడం వెనుక మతలబు ఏమిటని వారు ప్రశ్నించారు. నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని, సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకుల సుద్దాల భాస్కర్, తాడూరి భరత్, మధు, అజయ్, రాజు పాల్గొన్నారు.

సిద్దిపేటలో విద్యార్థి సంఘాల ఆందోళన

సిద్దిపేట, జూన్ 18: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. మంగళవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని పాత బస్టాండ్ వద్ద పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరు వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థులు నష్టపోయారని ఆరోపించారు. ఇంత జరిగినా ప్రధాని మోదీ నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల నేతలు అజ్మత్, సంజీవ్, వహాబ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు భాను, అజ్మత్ అలీ, రవి, నిశాంత్‌గౌడ్, ప్రతాప్, వంశీ, సాయిరాజా, క్రాంతి, రాజా బాబు, లక్ష్మణ్, జావిద్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 18: నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 24వ తేదీన హుస్నాబాద్‌లో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు చదివిన వారందరికీ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ నెల 24న ఉదయం 10గంటలకు హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో ప్రారంభమయ్యే జాబ్ మేళాను నియోజకవర్గంలోని ఏడు మండలాల యువత సద్వినియోగం చేసుకొని ఎక్కువ మంది ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏడు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు

ఎరువులను పరిశీలిస్తున్న ఏవో

మిరుదొడ్డి, జూన్ 18: వర్షాలు కురిసిన అనంతరం రైతులు పంటలు సాగుచేసుకోవాలని ఏవో బోనాల మల్లేశం కోరారు. మంగళవారం మిరుదొడ్డి టౌన్‌తో పాటు, మల్లుపల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో 26వేల ఎకరాల్లో వరి, 7వేల ఎకరాల్లో పత్తి, 4800 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేయనున్నారన్నారు. వానకాలంలో రైతులకు సరిపడేలా రసాయన ఎరువులను నిల్వ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సాయికుమార్, కో-ఆపరేటీవ్ సొసైటీ సీవో రాజు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయపోల్, జూన్ 18: గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మూడు రోజులుగా ఎల్లమ్మ ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణం ఎదుట వేద పండితులు వివిధ పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణ మహోత్సవానికి తరలివచ్చారు.పురోహితులు వివిధ పూజలు నిర్వహించిన అనంతరం ఎల్లమ్మతల్లి అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా కొనసాగింది. ఆయా గ్రామాల నుంచిఅధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు గ్రామ గౌడ సంఘం సభ్యులు గ్రామంలో బోనాలను ఊరేగింపు నిర్వహించి ఎల్లమ్మతల్లికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పురోహితు వెంటేశ్వరశర్మతో పాటు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నిక

సిద్దిపేట టౌన్, జూన్ 18: నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఎనుకున్నారు. సంఘం నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా యాద నరేందర్, ప్రధాన కార్యదర్శిగా కొండురి సతీశ్‌కుమార్, కోశాధికారిగా కొండూరి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు కనకయ్య, శ్రీనివాస్, చంద్రం, అరవింద్‌కుమార్, పోచయ్య, శ్రీరామ్, నర్సయ్య తెలిపారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

బోరు మోటరు అందజేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తొగుట, జూన్ 18: బడీడు పిల్లలను బడికి పంపాలని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామ పంచాయతీలో కాశగుడిసెల కాలనీలో మంగళవారం వారు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశగుడిసెల కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన ట్యాంక్ నిర్మాణమయ్యేవరకు నీటి ఎద్దడి తీర్చాలని కాలనీవాసులు కోరగా, రూ. 40వేల విలువగల నూతన బోరు పంపు ఇప్పించడం జరిగిందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో సీజనల్ వ్యాధుల ప్రబలి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో దుబ్బాక నియోజవర్గ కోఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి కనకయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల కృష్ణ, నాయకుడు విజయ్‌పాల్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఊల్లేంగల సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య,పార్టీ గ్రామ అధ్యక్షుడు స్వామి, మోదిన్, అమీర్, సాహు హుస్సేన్, బాబా, గోరేమియా పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

వాటర్ ట్యాంక్‌కు రంగులు వేస్తున్న శివబజరంగ్ యూత్ సభ్యులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్18: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన శివబజరంగ్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం బీసీ కాలనీలో యూత్ సభ్యులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న మినీ వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసి దానికి రంగులు వేశారు. కాలనీ సమీపంలోని బీటీ రోడ్డుపై స్పీడ్ బ్రేకులు సూచించేందుకు వీలుగా రంగులు వేశారు. శ్రమదానం చేసిన యూత్ సభ్యులను కాలనీ వాసులు ప్రత్యేకంగా అభినందించారు.

వర్షాల కోసం బతుకమ్మ ఆటలు

వానమ్మ వానమ్మ ఒక్కసారి వచ్చి పోవమ్మా అంటూ తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో మహిళలు మంగళవారం బతుకమ్మ ఆడిపాడారు.
- తొగుట, జూన్ 18

మాజీ సర్పంచ్‌కు సన్మానం

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 18 : రాజకీయం, కళారంగంలో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బూర్గోజు బాలబ్రహ్మచారిని హనుమకొండ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ పౌండర్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై బాలబ్రహ్మచారిని స్వర్ణ కంకణధారణ, తలపాక శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పర్యటిస్తున్న కమిషనర్ నర్సయ్య

అభివృద్ధి పనుల పరిశీలన

గజ్వేల్, జూన్ 18: గజ్వేల్ పట్టణంలోని రెండో వార్డులో వేస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పరిశీలించారు. పట్టణంలోని వైకుంఠధామం, పాండవుల చెరువు, 20వ వార్డులో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, ఏఈ శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై ప్రత్యేక కార్యాచరణ

జగదేవ్‌పూర్: మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశంగౌడ్

తొగుట: మాట్లాడుతున్న డాక్టర్ రాధాకిషన్

మద్దూరు(ధూళిమిట్ట): మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌రాజు

జగదేవ్‌పూర్, జూన్ 18: నులిపురుగుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఎంపీపీ బాలేశంగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగదేవ్‌పూర్, తీగుల్ పీహెచ్‌సీ వైద్యులు సత్యప్రకాశ్, రాజాగౌడ్‌తో కలిసి మండల్ లెవల్ టాస్క్ ఫోర్సు సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి చిన్నారికి నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఎంపీడీవో యాదగిరి, మండల విద్యాధికారి ఉదయభాస్కర్ రెడ్డి, ఎంపీవోశ్రీనివాసవర్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సెల్వరాజ్, పీహెచ్‌సీ సీహెచ్‌వో శ్రీమతి, హెల్త్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు నులిపురుగుల నివారణ కార్యక్రమం

తొగుట జూన్ 18: మండల వ్యాప్తంగా గురువారం నులిపురుగుల (నట్టల) నివారణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ తెలిపారు. మంగళవారం రైతు వేదికలో వైద్య సిబ్బందితో నులిపురుగుల నివారణ మందులపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏండ్ల వయస్సు వారికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాగరిక, స్వరూప, సూపర్‌వైజర్ శ్యామల, ఏఎన్ ఎంలు కృష్ణవేణి, లక్ష్మి, ఆశ,అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్18: నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మద్దూరు మండలంలోని లద్నూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్‌రాజు అన్నారు. మంగళవారం లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణకు వేసే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఒకటి నుంచి 19 ఏండ్లలోపు పిల్లలకు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకు గ్రామాల్లో మాత్రల పంపిణీ పూర్తి చేయాలన్నారు. 20 వరకు వేసుకోని పిల్లలకు 27వ తేదీ వరకు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ స్టువర్ట్‌సన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న చిన్నారి అక్కాచెల్లెండ్లు

గజ్వేల్, జూన్ 18: కుటుంబ కలహాలతో తల్లే ఇద్దరు కుమార్తెలను నీటి సంపులోకి దింపిన ఘటన మండలంలోని జాలిగామలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఇద్దరు చిన్నారులు అపస్మారక స్థితిలోకి చేరుకోగా.. గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆనన్య(3), సహస్ర (11నెలలు) కోలుకుంటున్నట్లు తెలిసింది. ఇద్దరిలో పెద్దమ్మాయి ఆనన్య పరిస్థితి నిలకడగా ఉండగా చిన్న అమ్మాయి సహస్రకు మరో 24 గంటలు గడిచితే ప్రాణాపాయం తప్పుతుందని వైద్యులు తెలిపారు.

ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్,జూన్ 18: షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్స్‌తో కూడిన ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జూలై 10 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మూడు లక్షలలోపు ఆదాయ ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు.అభ్యర్థులకు జూలై 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయిస్తామన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ స్టడీ సెంటర్ మంజూరు

బెజ్జంకి, జూన్ 18: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ స్టడీ సెంటర్ మంజూరైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో త్వరలో కోర్సుల ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మండలంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న జీపీ షెటర్లకు వేలం

బెజ్జంకి, జూన్ 18: మండల కేంద్రంలోని 17 గ్రామపంచాయతీ షెటర్లకు శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి లక్ష్మప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.35 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ అమలు చేయాలి

సిద్దిపేట టౌన్, జూన్ 18: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలత డిమాండ్ చేశారు. సిద్దిపేట ఐద్వా కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, అనేక చోట్ల మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిరెడ్డి నవీన, శారద, శోభ, శిరీష, మానస, లక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని కార్మికుడి మృతి

గజ్వేల్, జూన్ 18: రివర్స్‌లో వెనక్కి వచ్చిన ట్రాక్టర్ ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్ సమీపంలోని స్టీల్ కంపెనీలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లలిత్‌పూర్ జిల్లా కడేస్ర గ్రామానికి చెందిన వినోద్‌కుమార్(27) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం కంపెనీలో ట్రాక్టర్ వెనక్కి రీవర్స్ తీస్తుండగా వెనకాలే ఉన్న వినోద్‌కుమార్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో